ఎక్స్‌ప్రెస్ రైల్లో యాభై గంటల ప్రయాణం గడచింది.

రాత్రి బెర్తుపైన పడుకొని నిద్రపోతున్న సమయంలో యెప్పుడో యెక్స్‌ప్రెస్ రైలు తెలుగు రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. తెలుగు భాష తెల్లారాకగానీ అతడి చెవినబడలేదు.

"వీరగిరికోటకెళ్లాలంటే రేపు వుదయంవరకూ యెక్స్‌ప్రెస్ రైలులేదు. మధ్యాహ్నం మూడు గంటలకు పాసెంజరుంది. ఎక్స్‌ప్రెస్‌లో నయితే పన్నెండు గంటల ప్రయాణం. పాసెంజరులో వెళ్తే కోటీలో మారాలి. మొత్తం ట్వంటీ అవర్సు జర్నీ ... " అన్నాడు బుక్కింగ్ క్లర్కు.

"పాసెంజరులోనే వెళ్తాను. టికెట్టివ్వండి" అన్నాడు తాను.

పాసెంజరు రైలు యెద్దుల బండిలా మెల్లగా ప్రయాణం సాగిస్తోంది. అయినా అతడు విసుగు చెందడంలేదు. కంపార్టుమెంటులో రకరకాల గొంతుకలు కబుర్లు చెప్పుకుంటున్నాయి. ఆ మాటలు వింటూ, కిటికీలోంచీ అవతలికి చూస్తూ అతడు ప్రతి అయిదు నిముషాలకూ వోసారి పులకించి పోతున్నాడు.

రైలు యేదో స్టేషన్లో ఆగింది.

కిటికీలోంచీ తల వొంచి చూశాడు.

పెద్ద స్టేషనేమీగాదు.

స్టేషను మాస్టరు కొక రూము. ప్రక్కనే చిన్న వెయిటింగు రూము.

ఒక ఫర్లాంగు దూరంలో వూరు కనిపిస్తోంది. ఊరినుంచీ స్టేషనుదాకా సిమెంటు రోడ్డున్నట్టుంది. రోడ్డుపైన సందడిగా వుంది.

క...మ...లా...పు...రం... పసుపుపచ్చని బోర్డుపైన నల్లటి అక్షరాలు.

"పేపర్... సిగరెట్స్... అరటిపండ్లూ... కమలాలూ... ఆపిల్స్..." తోపుడు బండిని లాక్కొస్తున్న అబ్బాయి కేకలు...

"ఇదిగో అబ్బాయ్.. ఆ వీక్లీ యివ్వు..." జేబులోంచీ వొక రూపాయినోటు తీసి అతడి చేతి కిచ్చాడు కరుణాకరరావు.

పత్రిక నందుకొని పేజీలు తిప్పసాగాడు.

"ఈ పత్రికలే గనుక లేకపోతే తాను మాతృ భాషనే మరచిపోయి వుండేవాడేమో!..." అనుకున్నాడు.

రెండు నిముషాల్లో రైలు కదిలింది.

"ఇదిగో... నిన్నే... ఆ సూట్‌కేసు తీసి పైన బెట్టు... మేంగూడా టికెట్లు తీశాం... కూర్చోవాలి..."

రావు తల పైకెత్తి చూశాడు.

నలుగురైదుగురు కుర్రాళ్లు... పదిహేడుకూ యిరవైకీ మధ్య వయస్సు. టీనేజ్ అన్నమాట! చిన్నపిల్లలని చెప్పడానికీ వీల్లేదు. యువకుల్లోకి చేర్చడానికీ కుదరదు. నూనూగు మీసాలు...పొడుగ్గా జుట్టు... జానపద చిత్రాల్లో మగవేషాలేసుకుని తిరిగే కథానాయికలల్లే కనిపిస్తున్నారు.

"వినిపించడంలే? నీకే చెప్తున్నాను... ఆ సూట్‌కేసు తీసి పైన పడేయ్..." గులాబీ రంగు చొక్కా తొడుక్కున్న అబ్బాయి గద్దించాడు.

అతడికేసి విస్మయంగా చూశాడు రావు. ముఖంలో పాలబుగ్గల జాడయినా మాసిపోలేదు. చెంపలపైన బోదగడ్డిలా అక్కడక్కడా పిల్లి జుట్టు... రావుకు తన చిన్నకొడుకు జ్ఞాపకం వచ్చాను. అతడి పెదవులపైన నవ్వొకటి వుదయించింది. "అంత కోపం యెందుకూ? నేను తీసి పెట్టనని చెప్పానా యేమిటి? రా బాబూ, యిలా కూర్చో! మీరూ రండి... అందరూ సర్దుకో వచ్చు... ప్లీజ్ సిడౌన్ హియర్..." సూట్‌కేసు తీసి పైనపెట్టి వాళ్లను ఆహ్వానించాడు.

నోటు పుస్తకాలమీ, టిఫెన్ కారియర్లనూ ఆ సూట్‌కేసు పక్కనే పడేసి వాళ్లు అయిదుగురూ బెంచీపైన సర్దుకుని కూర్చున్నారు.

"సినిమా యెలా వుందిరా?" తెల్లరంగు చొక్కా వేసుకున్న అబ్బాయి అడిగాడు.

"పరమ బోర్... సుత్తి కొట్టేసింది..."

"పాటలు బాగాలేవా?"

"ఒకటే డ్యూయెట్టు..."

"ఫైటింగు...?"

"ఫైటింగా పాడా? అంతా సంగీతం... సా...పా...సా..."

అందరూ పగలబడి నవ్వసాగారు.

"ఏం చదువుతున్నావు బాబూ!" రావు పలకరించారు.

"ఇంటర్ ..." గళ్లచొక్కా అబ్బాయి సమాధానం చెప్పాడు.

"కమలాపురంలో జూనియర్ కాలేజీ వుందా?"

"లేకపోతే...యింటర్మీడియట్ హైస్కూల్లో చదువుతారా యెక్కడయినా?" రోజా రంగు చొక్కా అబ్బాయి కిసుక్కున నవ్వాడు.

అతడి మిత్రులందరూ శ్రుతి కలిపారు.

రావు కూడా స్పోర్టింగ్‌గా తీసుకుని నవ్వసాగాడు.

స్టూడెంటు కుర్రాళ్లు అతడివైపోసారి విస్మయంగా చూసి మళ్లీ కబుర్లలో పడిపోయారు.

## అణు గడియారాలు!

జపానులోని తపాలా, టెలికమ్యూనికేషన్ల ప్రయోగశాలలో పరమాణు శక్తి గడియారాలను నిర్మించడానికి సన్నాహాలను చేస్తున్నారు. లేసర్ కిరణాలను వుపయోగించే యీ క్రొత్త గడియారాలు తయారీకి ఐదు సంవత్సరాలు పట్టవచ్చు. ప్రమాణాలను సాధించడంలో యీ గడియారాలు అత్యుత్తమైనవి అని చెప్పవచ్చు. ఈ గడియారాల్లో 30 లక్షల సంవత్సరాలలో ఒక సెకను మాత్రం వ్యత్యాసం రావచ్చు. జపానుదేశం లేసర్ టెక్నాలజీ, డిజిటల్ టెలికమ్యూనికేషన్లలో సాధిస్తున్న అద్భుత ప్రగతి యీ క్రొత్త గడియారాల తయారీని సాధ్యపరుస్తున్నాయి. ప్రస్తుత సీసియం పరమాణువుల నుపయోగించి పని చేస్తున్న గడియారాలు వున్నాయి. వీటికి ఇన్‌ఫ్రారెడ్ లేసర్ కిరణాలను కలపడం వలన ఇంతకంటే పదిరెట్లు మెరుగైన గడియారాలు తయారు కాగలవని భావిస్తున్నారు.

"నువ్వేమో మాట్నీకి చెక్కేశావ్! కాలేజీలో యేం జరిగిందో తెలుసా?"

"ఏం జరిగింది?"

"సురేష్‌గాడు గాంగును తీసుకొచ్చి మన రంగణ్ణి కొట్టించాడు."

"నిజంగా!?"

"అవును ... మేమంతా పరిగెత్తుకొచ్చేశాం లేకపోతే మా పనిగూడా అయ్యేదే!"

"మొన్న వొక కోటింగిచ్చి చూపించాంగదా! వాళ్లేదటనా?"

"ఇదేమో! రేపు వుదయం లోపల నీ రక్తం కళ్లజూస్తానన్నాడట! ప్రతిజ్ఞగూడా చేశాడట!"

"వాడి మొహం! వాళ్ల తాత దిగిరావల్సిందే.. చూస్కో ... రేపు మధ్యాహ్నానికంతా నా తడాఖా చూపిస్తాను. దొంగవాయాలు ..."

రావు వులిక్కిపడి అతడివైపు చూశాడు.

ఆ అబ్బాయి మంత్రాలు చదువుతున్నట్టుగా యేవేవో బూతు మాటల్ని వల్లిస్తున్నాడు.

"కాలేజీ వుదయమే మూసేశారుగదా! మధ్యాహ్నం వీడెందుకెళ్లాడక్కకి?"

"టీసీ ఫారం కోసం వెళ్లాడులే! వాళ్లక్కడ మనవాళ్లెవరైనా కనిపిస్తారా అని కాసుక్కూ మన్నార్ట!"

"ఒంటరిగా దొరికాడని మీసం తిప్పారన్న మాట! ఆ సూరిగాడికి అంతధైర్యం ఎక్కడినుంచీ వచ్చింది? చూస్తాను. వాడి ముక్కొలిరిచేస్తే సరిపోతుంది. ఒకసారి పుత్తూరు కెళ్లాలని వుందేమో!"

మళ్లీ బూతులు ...

వీళ్లేనా తనవాళ్లు ?

ఇదేనా తనభాష ?

ప్రతిమాటా ఒక బాణంగా మారి హృదయంలోకి దూసుకుపోతున్నట్టుగా రావు విలవిల లాడిపోసాగాడు.

"అయినా నువ్వింత ఫూలిష్‌గా బిహేవ్ చేస్తావనుకోలేమురా కిరణ్! వాళ్లు కాలేజీకి బదులుగా థియేటర్ దగ్గిరికొచ్చి వుంటే?"

"వస్తే తెలిసేది! నేనేమీ అజాగ్రత్తగా లేను. ఇలా చూడు..." రోజా రంగు షర్టును పైకెత్తి చూపాడు. లోపల బెల్టుకు బదులుగా సైకిల్ చైనొకటి వ్రేలాడుతోంది.

"అంతేగాదు! ఇలా చూడు.." జేబులోంచీ పేనాకత్తి పైకొచ్చింది.

"మీరు గూడా జాగ్రత్తగా వుండండి. ఈసారి అటో యిటో తేలిపోవల్సిందే! ఖూనీలు జరిగాల్సి వచ్చినా భయపడేది లేదు..." కోపంతో పిడికిలి బిగించాడతను.

"రేయ్... చైను లాగేసినట్టున్నారు..." తెల్ల చొక్కా అబ్బాయి లేచి డోర్ దగ్గరికి పరిగెత్తాడు.

ఇనప చక్రాలకు బ్రేకులు తగులుకుంటున్న చప్పుడు... తుపాకీ దెబ్బతిన్న గద్దలా రెక్కలు కొట్టుకుంటున్న ఫాను గోల... నట్టూడిపోయిన లైట్‌షేడ్ గొడవ...

కంపార్టుమెంటులోని వ్యక్తులందరూ స్టూడెంట్లకేసి చూస్తూ విస్మయంలో మునిగి పోయారు.

"రేయ్ కిరణ్... వాళ్లొచ్చేశార్రా!" తెల్ల చొక్కా అబ్బాయి గవలుబోస్తూ వచ్చేశాడు.

"ఎవర్రా ?..."

"ఎవరు ?..."

"వాళ్లేనా ?..."

అయిదుగురు కుర్రాళ్లూ కిటికీల దగ్గరికి పరిగెత్తారు.

రావు కూడా కిటికీలోంచి తొంగిచూశాడు.

రైలు వారి కిరువైపులా రెండు మూడు మీటర్ల పొడవున్న మట్టిగుట్టలు... పైన మామిడి తోటలు... తోటకు మూరెడెత్తున్న కల్ల...

బ్రేకులు తన్నుకున్నాయి. రైలు పెద్దగా నిట్టూరుస్తూ నిలబడిపోయింది.

ఇంజను దగ్గర పెద్దగా అలజడి...

మెడ సారించి చూశాడు రావు.

యాభై అరవైమంది కుర్రాళ్లు... ఎవరి వయస్సూ యిరవైని సమీపించివుండదు. కొందరి చేతుల్లో వెదురుకర్రలు... మరికొందరి చేతుల్లో యినపకడ్డీలు... నలుగురయిదుగురు అబ్బాయిలు చొక్కాలు విప్పుకున్నారు. వాళ్ల మెడల్లో సైకిలు చైన్లు వ్రేలాడుతున్నాయి.

ఎగురుతూ, దుముకుతూ, పడుతూ, లేస్తూ, బిగ్గరగా కేకలేస్తూ రైలు ప్రక్కనే పరిగెత్తుకుంటూ ముందుకొచ్చేస్తున్నారు.

"ఏమిటండీ గొడవ ?..." ఎదుటి బెంచీలోని యువకుడు కంగారుగ ప్రశ్నించాడు. అతడి భార్య భయంతో ముడుచుకుపోతోంది.

"నాకూ తెలియదండీ..." అన్నాడు రావు.

"నేను లావెట్రీలో దాక్కుంటాను..." తెల్ల చొక్కా అబ్బాయి లావెట్రీలోకి దూరి తలుపేసుకున్నాడు.

"ఏవండీ! మీరు కాళ్లు పైకెత్తితే నేను సీటు క్రిందికి దూరేస్తాను..." గళ్లచొక్కా అబ్బాయి యేడుపు మొహం పెట్టాడు.

బ్లూ చొక్కావాడు సామాన్ల చెక్కపైకెక్కి కూర్చున్నాడు.

"ఇక్కడున్నాడ్రా వాడు..." బయటినుంచీ కేక...

"కిరణ్ గాడీ పెట్టెలో వున్నాడ్రా!"

# తల్లి నేల

"పట్టుకోండి..."

"పట్టుకోరా వాణ్ణి ..."

"కొట్టండి నాయాల్ని ..."

"రేయ్ బుజ్జీ! యెక్కడా నా చైను ..."

"దొంగనాయాలు ..."

"చంపేయండి ... తర్వాత చూసుకుందాం."

కుర్రాళ్లు కంపార్టుమెంటులోకి దూసుకొచ్చేస్తున్నారు.

రోజారంగు చొక్కా అబ్బాయి నిలువునా వణికిపోసాగాడు.

బెంచీల క్రింద స్థలం లేదు.

పైన ఖాళీలేదు.

కిటికీల కవతల జనం మూగిపోయారు.

అచేతనుడై బెంచీపైన కూలబడిపోయాడు.

"ఏరా నాయాలా!" చొక్కా విప్పుకున్న కుర్రాడొకడు అతడి షర్టు కాలరు పట్టుకొని పైకి లేవదీశాడు.

"ఏమ్రిటా కిరణ్‌గా! నన్ను కొడ్తానని సవాల్ చేశావటగదా! కొట్టుచూద్దాం" యింకో వ్యక్తి ముందుకు తోసుకొచ్చాడు.

"వాడు కొట్టేదేమ్రిటా ? యింకా మాటలెందుకు వాడితో ... ఏయ్‌రా ముందు."

"తలాఒక దెబ్బ ... పైకి రక్తం కనిపించగూడదు. కుమ్మిపారేయండి."

"ఏ కీలుకాకీలు విరిగిపోవల్సిందే."

"ముందు ఆ నోటిమీద యెయ్యండ్రా ఒక ధర్మేటు."

"మనవాడు పెద్ద బ్రూస్లీలే!"

కిరణ్ చొక్కా చినిగిపోయింది. ఒకరిమీద ఒకరు. ఒకర్ని తోసుకుంటూ మరొకరు అందరి చేతులూ కిరణ్ వీపుపైన్నే.

"అమ్మోయ్ ... నాన్నోయ్ ... బాబోయ్ .. అయ్యయో! సారీ! నన్ను వదిలేయండి" కిరణ్ గొంతుక స్పష్టంగా వినిపించడంలేదు. మాటల కంటే ముందుగా యేడుపే వినిపిస్తోంది.

రావు చూస్తూ వూరుకోలేకపోయాడు.

"బాబూ! నాయనా! చాలు చాలు...ఇకచాలు బిడ్డ అన్యాయంగా చచ్చిపోతాడు. వదిలేయండి" కిరణ్ చుట్టూ చేరిన కుర్రాళ్ల నందరినీ రెండ చేతులతో దూరంగా లాగేయసాగాడు.

"ఈయనెవర్రా!"

"నీకెందుకయ్యా యీ గొడవ ... దూరంగా నడు."

"పెద్ద హీరో బయల్దేరాడు. వందిట్నో పొరెగాడు."

"దార్లో పోయేవాడివి, నీకు దీంతో యేంపని? వెళ్తావా లేదా ?"

రావు వీపుపైన కూడా నాలుగయిదు దెబ్బలు తగిలాయి.

అయినా అతడు తన ప్రయత్నాన్ని మానుకోలేదు.

బెల్లం చుట్టూ ఈగల్లా చుట్టుకున్న కుర్రాళ్ల నందరినీ దూరంగా లాగిపారేసి, కిరణ్‌ను అక్కున చేర్చుకున్నాడు.

"వదిలేయండి ... బాబ్బాబూ...చిన్నవాడు.. అన్యాయంగా చచ్చిపోతాడు" ఆక్రోశించసాగాడు.

"వెళ్తావా ? నీకూ నాలుగు తగిలించమంటావా ?..."

"ఎవడో పిచ్చోడులాగున్నాడు. వాణ్ణి దూరంగా లాగేయండి ముందు."

వెనకనుంచీ బూతుల శతకం..

రావ్ కిరణ్‌కేసి చూశాడు. అతడి కళ్లల్లో కన్నీళ్లు ప్రవహిస్తున్నాయి. పెదవి చిట్లింది.. చెంప పగిలింది... తలలోంచీ నెత్తురు కారుతోంది

రావుకు తన చిన్నకొడుకు జ్ఞాపకం వచ్చాడు పిల్లల్ని రెక్కల క్రిందికి చేర్చుకునే తల్లికోడిలా హృదయానికి అదుముకున్నాడు.


కుర్రాళ్లలో పొంగు తగ్గింది.


"చూడూ, పెద్దాయినా! మర్యాదగా దూరంపో..."

"ముసలాయనకు గూడా పూజ కావల్సి నట్టుందిరా..."

"వీడిది గూడా వాడి కాస్టేనేమోరా!..."

అందరిలోకీ పొడుగ్గా కనిపిస్తున్న కుర్రాడి రెండు చేతులూ గట్టిగా పట్టుకున్నాడు రావు - "చూడు బాబూ! నాకంటే చిన్నవాడివి! అయినా



# తల్లి నేల

చేతులు జోడిస్తున్నాను. కుర్రాడు నజ్జుగుజ్జయి పోయాడు. చూడు యెలా యేడుస్తున్నాడో! నువ్వు బుద్ధిమంతుడిలాగున్నావు. వదిలిపెట్టేసెయ్యండి.''

''నీకు తెలియదయ్యా! నువ్వొదిలిపెట్టు... వీడు పెద్ద హీరోలే! ఖూనీలు చేస్తాడట! పెద్ద మగాడు బయల్దేరాడు.''

''ఖూనీలు చేసినవాళ్లకే వురిశిక్షలు వెయ్యడం లేదు. బాబ్బాబూ! మీ తమ్ముడిలాంటివాడు. కావలిస్తే పెద్దలముందు విచారిస్తే చాలదా? అంతగా అయితే ఫైన్ వేస్తే సరిపోతుంది గదా!''

''ఫైనా?! వీడెక్కడ కడ్తాడు?''

''వీడు గాకపోతే, వీడి నాన్న...''

''వీడి నాన్నా?!... సరేలెండి! ఆయన చేసిన నిర్వాకమే యిది! వాడే ఈ కొడుక్కు మద్దతు.''

''మా నాన్నను వాడూ వీడూ అంటే వూరుకునేది లేదు. రేపు తెలుస్తుందిలే మీ కథ!'' ఏడుస్తూనే అడ్డు తగిలాడు కిరణ్.

గిరుక్కున వెనుదిరిగి చూశాడు రావు. అతడికి చెప్పలేనంత కోపం వచ్చింది. ''నోర్మూయరా ముందు, చేసిన నిర్వాహం చాలదా యేమిటి?'' అంటూ విసుక్కున్నాడు. మళ్లీ కుర్రాళ్లకేసి తిరిగి ''చిన్నపిల్లవాడు! మంచీ చెడూ తెలియదు. ఏదో వాగుతున్నాడు. పోతేపోనీ వదిలేయండి'' అంటూ నచ్చజెప్పబోయాడు.

''గురువుగారికి యింకా పౌరు తగ్గలేదురా!'' అంటూ వొకడు ముందుకురికాడు.

''ఎయ్‌రా! ఆ నోటిమీదనే యెయ్...'' మరొకడు దూసుకొచ్చాడు.

''తన్నరా''

మళ్లీ అందర్నీ కిరణ్‌కు దూరంగా లాగేసరికి పది నిముషాలు పట్టింది.

మిగిలిన కంపార్టుమెంటులలోని ప్రయాణికు లంతా దిగి చుట్టూ చేరుకున్నారు. డ్రైవరూ, ఫోర్మెనూ తమకేమీ పట్టనట్టుగా వో రాతిపైన కూర్చుని బీడీలు తగలేస్తున్నారు. గార్డూ, అండర్ గార్డూ కుర్రాళ్లతో మంతనాలు సాగిస్తున్నారు.

''నీకు తెలియదు నువ్వెండవయ్యా స్వామీ! మర్యాదగా చెప్తూంటే వినిపించుకోవేం? వీడు దొంగ నాయాలు. ఏ కాలుకా కాలు ... ఏ కీలుకా కీలు ... అంతే!''

రావులో శక్తి సన్నగిల్లింది. రెండు చేతులూ జోడించి కిరణ్‌కు అడ్డంగా నిలుచున్నాడు.

''అయితే దెబ్బకు దెబ్బ కొట్టడం కంటే మరో మార్గమేలేదా? కావలిస్తే ఫైన్ వేయండి. అందరూ వెలివేసేయండి. అంతగా అయితే అపాలజీ రాయించుకోండి.''

''రేయ్ ... వొక అయిడియా!'' గడక్కర లాంటి అబ్బాయి ముందుకొచ్చాడు. ''అందరూ ఆగండి...వొక అయిడియా! ఆయన చెబుతున్నాడు గదా! అపాలజీ రాయించుకుందాం.''

''అపాలజీ యెందుకురా సుబ్బరాయుడూ! నీకేమైనా పిచ్చి పట్టిందా?'' ఎవరిదో ఒక కంఠం హెచ్చరించింది.

''కాదేస్తే యేమొస్తుందిరా? 'నేను వెధవను... నా బుద్ధి గడ్డి తిన్నది. నేను అడ్డగాడిదను' – అని వాడే రాసివ్వాలి. ఎలావుంది నా అయిడియా ...''

''భలే భలే!''

''చూడు నాయనా! నువ్వు తెలివైన వాడివి లాగున్నావు. కావలిస్తే నేనే వ్రాస్తాను.' సంతకం మాత్రం ఆ అబ్బాయే పెడ్తాడు'' రావు అతణ్ణి ప్రాధేయపడసాగాడు.

''నువ్వెందుకు రాయడం? ఆ వెధవే రాయాలి.''

''ఈ రోజుకీ శాంతి చాలు! అపాలజీ రాయించుకొని వదిలిపెట్టేద్దాం''

''ఇదిగో కాగితం ... పేనా యెక్కడ?''

''నా దగ్గరుందిలే!'' కిరణ్‌ను కిటికీ ప్రక్కన కూచోబెట్టి ప్రక్కనే కూచుంటూ కేకేశాడు రావు.

వణుకుతున్న చేతులో కలమూ కాగితమూ చేతికి తీసుకున్నాడు కిరణ్.

''క్రిందికి అట్టతీసుకోరా నాయాలా!''

ఒక అట్ట ముందు కొచ్చింది.

అతడు అందుకున్నాడు. కానీ అతడి వేయి ముందుకు కదల్లేదు.

''రాయి... నేను వెధవను ... అడ్డగాడిదను... స్టుపిడ్‌ను ... ఫూల్‌ను ... యిడియట్‌ను ... కుక్కను... నక్కను...'' నవ్వులు... కేరింతలు.

రావు, కిరణ్ ముఖంలోకి చూశాడు – 'లాభం లేదు! చావనైనా చస్తాడేమోగానీ వీడు అపాలజీ రాసిచ్చేటట్టులేదు' అనుకున్నాడు.

''అలా రాసే బావుండదు! రేపు యెక్కడయినా చూపిస్తే అందరూ జోక్‌గా తీసుకుంటారే తప్ప దీన్ని నమ్మరు. అపాలజీ అలాగాదు రాయడం! ఎందుకూ? నేను రాసి చూపిస్తాను గదా!'' అంటూ కాగితాన్ని తన చేతికి తీసుకున్నాడు. 'ఐయామ్ సారీ! తప్పు నాదే! మరోసారి యిలా చేయను. భగవంతుడి సాక్షిగా చేయను. మా అమ్మపైన వొట్టు ... ఈ భూమిపైన ప్రమాణం చేసి చెప్తున్నాను' గబగబా నాలుగక్షరాలు గిలికి కిరణ్ చేతికిచ్చాడు. ''సంతకం పెట్టేయరా తండ్రీ! లేకపోతే వాళ్ళు చంపేస్తారు'' అన్నాడు.

''పెట్టరా నాయాలా!''

'మిత్రీ మిత్రీ చూస్తాడు చూడు.''

''సంతకం పెట్టు...లేకపోతే వీళ్లు వూరుకోరు. తప్పించుకునే మార్గమే తెలియని వాడివి. నీకీ గొడవలెందుకు? మీ అమ్మా నాన్నా యెలా విలవిలలాడిపోతున్నారో యేమిటో! సంతకం చేసేయ్.''

కిరణ్ అంత యేడుపులోనూ రావుకేసి వురిమి చూశాడు. అంతలో యేమనుకున్నాడో యేమిటో – కాగితంపైన సంతకాన్ని బరికేశాడు.

''దొంగనాయాలు... అక్షరాలు గూడా వంకరే!...'' నవ్వుతూ వో కుర్రాడు కాగితాన్ని చేతికి తీసుకున్నాడు.

''ఇక పదండ్రా! గార్డుగారు యేడుస్తున్నారు.''

''బాబూ వెళ్లండి!'' ప్రయాణీకులు కొందరు వేడుకున్నారు.

''టైమయిపోయిందయ్యా నాయనా!'' గార్డు ప్రాధేయపడుతున్నాడు.

''పదండ్రా! మళ్లీ తోకాడిస్తే ఈసారి కాళ్లే గల్లంతే!''

''గురుంచుకోరా యిడియట్...''

ఇక యిలా కుదరదన్నట్టుగా గార్డు విజిల్ వేసి పచ్చజెండా వూపేశాడు.

కుర్రాళ్లు వొకరివెంట వొకరుగా క్రిందికి దూకసాగారు.

ఇంజను గొట్టంలోంచి ఆవిరి బుసలు కొట్టింది.

కీచుమన్న కూత...

రైలు కదిలింది.

ప్రయాణీకులందరూ సర్దుకుని కూర్చున్నారు.

తెల్లచొక్కా అబ్బాయి లావెట్రీలోంచి బయటి కొచ్చాడు. గళ్లచొక్కా కుర్రాడు బెంచీ క్రిందినుంచీ యివతలి కొచ్చేశాడు. బ్లూచొక్కావాడు పైనుంచీ కిందికి దిగాడు.

మిత్రుల్ని చూడగానే యేడుపునాపేసి బుంగ మూతి పెట్టుకుని కూర్చున్నాడు కిరణ్.

''బంగారంలాంటి చొక్కా... తుక్కుతుక్కయి పోయింది గదరా!''

''ప్చ్... బనీను గూడా క్లోజ్...''

''పెంటు మాత్రం... చింపిపారేశారే!''

''రేయ్ తల్లోంచి నెత్తురొస్తోంది...''

''రాక్షసులు! పెదవులు చిట్లిపోయాయి.''

''రోగ్స్! వీపుపైన సైకిలు చైను గీసుకు పోయింది.''

ఒకరి తరువాత వొకరు పరామర్శ చేయసాగారు.

''అయినా మంచి ఫ్రెండే దొరికాడు మీకు! దెబ్బలయినా తింటానంటాడుగానీ సంతకం చేయనంటాడే!'' అంటూ చిరునవ్వు నవ్వాడు రావు.

కిరణ్ రివ్వున తల పైకెత్తి రావుకేసి వురిమి చూశాడు. చివాలున పైకి లేవబోయాడు. కానీ ''అబ్బా!'' అంటూ కాలు పట్టుకుని కూలబడి పోయాడు.

''ఏమయిందిరా? కాలు విరిగిందా యేమిటి?'' బ్లూచొక్కా కంగారుపడ్డాడు.

''లేదుగానీ యిలా రా'' – అంటూ అతణ్ణి దగ్గరికి పిలిచి, అతడి భుజాలపైన చేతులేసుకుని పైకి లేచాడు కిరణ్. నలుగురూ మెల్లగా డోర్ దగ్గరున్న స్థలంలోకి వెళ్లి నిలబడి మంతనాలు చేసుకోసాగారు

''చూశారా సార్! మానర్స్ లెస్ బ్రూట్స్... మీరెంత కష్టపడి కాపాడారు వాణ్ణి! మిమ్మల్నే మింగేసేటట్టు చూస్తాడేమిటి వాడు?'' ఎదుటి బెంచీలోని బుష్‌షర్టు యువకుడు కారాలు మిరియాలూ నూరసాగాడు.

''పోనీలెండి! కుర్రతనం! ఆవేశం యెక్కువ'' రావు నవ్వేశాడు.

''ఇంతకూ ఈ గొడవకంతా కారణమేమిటండీ?'' బుష్‌షర్టు యువకుడి భార్య ప్రశ్నించింది.

''తెలియదమ్మా నాకు'' అన్నాడు రావు.

''మీకూ తెలియదా?'' ఆమె ఆశ్చర్యచకితు రాలైపోయింది. ''ముక్కూ మొహం తెలియని కుర్రాడిపైన అంత ఆక్కరెందుకండీ మీకు?''

''నిజంగా నాకేమీ తెలియదమ్మా! నేనూ మీలాంటి పాసెంజర్నే! వీరగిరికోటకు వెళుతున్నాను. అయినా గొడవెందుకయితే మనకేమిటి చెప్పు? అంతమంది వొక్కటై ఆ కుర్రాణ్ణి కుమ్మేసారే

స్తుంటే యెంతటి వాడికైనా గుండెల్లో దేవినట్లుండదా చెప్పు!"

"అసలు కారణమేమిటంటే ..." అవతలి వైపు కిటికీ దగ్గర కూర్చున్న వ్యక్తి గొంతు సవరించుకున్నాడు – "మామూలు సంగతే లెండి! అన్నిచోట్లా జరుగుతున్న విషయమే! మరేమీలేదు, వారం రోజుల క్రితం కమలాపురంలో స్టూడెంటు యెలక్షన్లు జరిగాయి. అక్కడ రెండు కాస్టులు ఒకదాన్నొకటి డామినేషన్ చేసేయాలని కత్తులు నూరుకుంటూ వుంటాయిలెండి! చిన్నపిల్లలనుకుంటున్నారేమో, వీళ్ల పెద్ద వాళ్లకేమీ తీసిపోరు. ఇద్దరు కాండిడేట్లకూ తలా నాలుగైదు వేలు ఖర్చయిందట! పోలీసు ప్రొటెక్షనులో పోలింగు జరిగింది. ఎవడో వొకడు గెలిచాడు. ఓడినవాడు వూరుకుంటాడా చెప్పండి? కొట్లాటలూ, దొమ్మీలు... ఎదుటి పక్షంలోవివాడు వొంటరిగా కనిపిస్తే వాడిపని గోవిందా! కాలేజీకి సెలవులు డిక్లేర్‌చేసి వారం రోజులయింది. రెండు మూడురోజులు వన్నాట్ ఫోర్ సెక్షను గూడా విధించారు. మీరు క్రొత్తగా వస్తున్నారు కాబట్టి మీకు తెలియదుగానీ మాకీ స్టూడెంటు లీడర్లపేరు బాగా పరిచితమే! ఈ కిరణ్‌ది సోమన్నపాలెం. అంటే వచ్చే స్టేషనన్న మాట! రోజూ ఈ రైల్లోనే కాలేజీకి వెళ్లివస్తాడు. ఆ సురేష్‌దేమో చింతపల్లె! చైనులాగారు చూడండి – అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో వొక పల్లెటూరు. వాడి గాంగులోని వాడెవడో కమలాపురం నుంచీ రైల్లోనే వచ్చాడు. అంతా ప్రీప్లానన్నమాట! వీళ్లిక్కడ కాసుక్కూచున్నారు. వాడు చైనులాగి రైలు నాపేశాడు. ఈ రైల్లో నయితే వీడు వొంటరిగా దొరుకుతాడని నమ్మకం."

"ఈ సంగతి వాళ్ల అమ్మా నాన్నకు ..." రావు అడ్డుతగిలాడు.

"అందరికీ తెలుసు ... కిరణ్‌గాడి నాన్న పెద్దలాండు లార్డు. ఎలెక్షన్లకని కొడుకడిగితే నాలుగు వేలిచ్చాడట! ఇక సురేష్‌గాడి సంగతీ అంతే!"

"గొడవ జరుగుతుందని తెలిసినప్పుడు డ్రైవరు రైలు నాపకుండా తీసుకెళ్లిపోతే బావుంటుంది గదండీ ..."

"చైనులాగారుకదా! గబగబా వ్యాక్యూమ్ సరిజేసుకుని బయల్దేరారనుకోండి! మళ్లీ చైను లాగుతారు. ఒక్కసారి చైనులాగితే న్యూ రూపాయల బొగ్గు వేస్టవుతుందట. డ్రైవరు గొణుక్కుంటూ వుంటే విన్నాను."

"అయినా మీరు చాలా రిస్క్ తీసుకున్నారు సార్!" ప్రయాణీకుడొకడు సానుభూతి చూపాడు.

"ఈ టీనేజ్ కుర్రాళ్లున్నారే – వీళ్ళు అటు పెద్దవాళ్లూ గాదు, యిటు చిన్నవాళ్లూగాదు. ఈ వయస్సులో అందరూ కోతుల్లా ప్రవర్తిస్తారట! ఎక్కడో చదివాన్నేను ... అన్నట్టు మీ షాక్కా గూడా కాలర్ దగ్గర చినిగినట్టుంది. చూసుకున్నారా సార్ మీరు ...?" బుష్ షర్టు యువకుడు అడిగాడు.

మెడతిప్పి షర్టునోసారి చూసుకుని "పోతే పోనీలెండి! ఆ అబ్బాయి బతికిపోయాడు. అంతే చాలు!" అంటూ చిరునవ్వు నవ్వాడు రావు.

"సోమన్నపాలెం వచ్చేసిందండీ! ఇక్కడ రైలుకు వాటరింగ్ వుంటుంది. అయిదు నిముషాలు ఆగుతుంది రైలు... ఇదే మా వూరు..." అవతలి వైపు కిటికీ దగ్గర కూర్చున్న నడివయసాయన పైకిలేచాడు.

రైలు స్టేషన్లో ఆగింది. కంపార్టుమెంటు సగానికి పైగా ఖాళీ అయింది.

"నేనూ వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటాను" అంటూ పైకి లేచాడు రావు.

"ఇదిగో... యింకా యిక్కడే వున్నాడ్రా వీడు" కిరణ్ కంఠం ఖంగున మ్రోగింది.

"చూస్తారేమిటి? వడ్డించండి తలా నాలుగు... రైలు కదులుతుందేమో! త్వరగా కానీ..." మరో కంఠం.

కుర్రాళ్ల గుంపుకు మధ్యలో రావెక్కడ వున్నాడో కనిపించడంలేదు. అతడి కేకలు సైతం వినిపించడంలేదు.

"ఏమిటిది? యేమిటీ అన్యాయం!" బుష్‌షర్టు యువకుడు ఆక్రోశించాడు.

"నోర్మూసుకుని కూర్చో! లేచావంటే నీకూ పూజవుతుంది." ఒక కుర్రాడు హుంకరించాడు.

బుష్‌షర్టు యువకుడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అతడి భార్య కళ్లు రెండూ గట్టిగా మూసుకొంది.

"అందరూ వొకటిగా వద్దాం వుండమంటే మీరంతా తొందరగా వచ్చేశారెందుకు? ఇదేనా ఐకమత్యమంటే?" కిరణ్ గొంతుక మళ్లీ వినిపించింది.

"ఇలా అవుతుందని మాకేం తెల్సు..."

"అయినా అపాలజీ యెందుకు రాసిచ్చావురా నువ్వు? ఆ సూరిగాడు దానికి ప్రేమ గట్టించి కాలేజీలో తగలేస్తానన్నాడట..."

"నేనెక్కడ రాసిచ్చాను? వీడే బలవంతంగా నాచేత సైన్ చేయించాడు. దొంగనాయాల్లు.. ఎముకలొక వరస యిరిచేయండి."

"మహా అయితే స్పృహ తప్పేటట్టు కొట్టే వాళ్లేమో! అంతేగదా? ఇప్పుడు చూడు! ఎంత అవమానం! ఇంతకంటే చావే మేలు!"

"ఖూనీలు చేసేంత ధైర్యమా ఆ వెధవలకు?"

"వాళ్ల సంగతేమిటో రేపు చూద్దాం."

"అన్నింటికీ వీడే కారణం... అదిగో రైలు కదులుతోంది... తలా నాలుగు వడ్డించండి."

చిన్న జర్కుతో రైలు ముందుకు కదిలింది. కుర్రాళ్లంతా కిందికి దిగసాగారు.

కిరణ్ రావు శరీరానికి దగ్గరగా వచ్చాడు కాండ్రించి ముఖంపైన వుమ్మి, బూతులు చదవసాగాడు.

"ఇక చాల్లే రారా! రైలు స్పీడు హెచ్చింది." కిరణ్ ప్లాట్‌ఫాం పైకి దూకేశాడు.

"సార్... సార్... ఎలా వున్నారండీ..." బుష్‌షర్టు యువకుడు యేడుపు గొంతుకతో పలకరిస్తూ కుదిపి చూశాడు.

"బాబాయిగారూ! మీకేమయ్యిందండీ" అతడి భార్య యేడ్చేస్తోంది.

"అయ్యో! బట్టలు నాశనమయ్యాయి ఒళ్లంతా రక్తమే!..."

"కాస్త జరగండి నాయనా! నోట్లో కాసిని మంచినీళ్లయినా పోద్దాం" ఒక ముసలావిడ అతడి తలనుతీసి వొళ్లో పెట్టుకుంటూ హెచ్చరించింది.

పెదవుల్ని బలవంతంగా విడదీసి గ్లాసుతో నీళ్లు పోయసాగింది. ధార ... ఈ గడ్డలోంచీ పైకొచ్చిన జలధార ... పెదవుల్లోంచీ కారుతున్న రక్తంతో కలిసి గొంతులోకి జారింది.

బలవంతంగా కళ్లు తెరిచి చూశాడు అతను. అంతా మసకగా కనిపిస్తోంది.

'ఎవరీమె! ముసలిది ... వొళ్లంతా ముడతలే! ముగ్గుబుట్టలాంటి తల ... కళ్లల్లో నీళ్లు. శరీరమంతా వొణుకు ...'

"అమ్మా!" ముద్దగా వొక కేక బయటికొచ్చింది.

కరుణాకరరావుకు మళ్లీ స్పృహ తప్పింది. ●

